# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ గురువారం | 24 జూలై 2025 | ■ 10 పేజీలు


## మంత్రులను కలసి కృతజ్ఞతలు తెలిపిన ఖానాపూర్ ఎమ్మెల్యే





# కుండపోత

## మూడో రోజూ భారీ వర్షం

■ ఎడతెరపిలేని వర్షం.. ■ పొంగిన వాగులు, వంకలు ■ భయం గుప్పిట్లో లోతట్టు ప్రాంతాల ప్రజలు

■ సింగరేణి ఓసీల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ■ ఎల్లంపల్లి పెరుగుతున్న నీటి మట్టం ■ ఉప్పొంగుతున్న ఎర్రవాగు

■ ఎర్రవాగుకు పోటెత్తిన వరద ■ తృటిలో తప్పించుకున్న రైతు కూలీలు ■ ఎర్రవాగులో చిక్కుకున్న ట్రాక్టర్

■ సహాయం చర్యల కోసం ఎదురు చూస్తున్న రైతు కుటుంబం ■ ఓసీపీల్లో ఉత్పత్తికి ఆటంకం ■ నిలిచిన బొగ్గు ఉత్పత్తి..





### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

■ లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

■ ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు వాగులు దాటొద్దు

■ అత్యవసరమైతే డయల్ 100, 8712670551 నెంబర్‌ని సంప్రదించాలని

■ పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

■ ఎస్పీ కాంతిలాల్ పాటిల్



మంచిర్యాల జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొరలుతున్నాయి. గోదావరి, ప్రాణహిత నదుల్లో భారీ గా వరద నీరు చేరింది. దీంతో నదుల పరివాహక ప్రాంతాల ప్రజలు ఒకింత భయాందోళనకు గురవుతున్నారు. గత రెండు రోజులుగా జిల్లాలో ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలోని కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లో 40.5 మి ల్లీ మీటర్లు, వేమనపల్లి మండలం నీల్వాయిలో 39.5, కోటపల్లి మండలం దేవులవాడలో 30.5, కన్నెపల్లి మం డల కేంద్రంలో 24.8 మి.మీ, నెన్నెల మండలంలో 18.5 మి.మీ, బెల్లంపల్లి మండలంలో 17.5, భీమిని మండ లంలో 17.0, కాసిపేట మండలం కొండాపూర్‌లో 16.5, జైపూర్, తాండూరు మండలాల్లో 12.8, మందమర్రి మండలం అందుగుల పేటగలో 11.3 మిల్లీ మీటర్ల చొ ప్పున వర్షపాతం నమోదైంది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలంలో 234.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్‌లో 106.5, కౌటాల మండల కేంద్రంలో 103.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. బెజ్జూరు మండలంలో బుధవారం ఉదయం నుంచి ఏకదాటిగా కురిసిన కుండపోత వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. సుమారు 6 గంటల పాటు కురిసిన భారీ వర్షానికి మండలంలోని వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. సోమిని గ్రామాల మధ్యలో లెవల్ వంతెనలు ఉప్పొంగి ప్రవహించడంతో 8 గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి.

## ఆర్డీవో కార్యాలయం ఆస్తుల జప్తు



భూపరిహారం కేసులో కోర్టు ఉత్తర్వులు జారీ - 13మంది రైతులకు రూ.2.24కోట్లు ఇవ్వాలని 2020లో తీర్పునిచ్చిన కోర్టు - జాప్యంతో ఆస్తులు జప్తు చేసిన కోర్టు సిబ్బంది

## బీఆర్ఎస్ హయాంలోనే టైగర్ రిజర్వు ప్రతిపాదనలు

### జీఓ 49పై సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయికీ అవగాహన లేదు - మాజీ ఎంపీ సోయం బాపూరావు

టైగర్ రిజర్వు ప్రతిపాదనలు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జీవో49ని రద్దు చేసిందని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జీవో అమలు జరిగితే తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని ప్రజలకు స్పష్టమైన హామీ ఇస్తున్నానని చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఆదివాసీల హక్కులను కాలరాసేందుకు గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, బీజేపీ ప్రభుత్వం కలిసి నేషనల్ టైగర్ జోన్‌కు ప్రతిపాదనలు చేశాయని అన్నారు. ఈ ప్రతిపాదనల్లో కూడా బీఆర్ఎస్ నాయకుల సంతకాలు కూడా ఉన్నాయని సాక్ష్యాలను కూడా చూపారు.






## మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..
- మహిళా సంఘాల వ్యాపారాలకు చేయూత
- అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అండగా..
- రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్



**మంచిర్యాల, జూలై 23 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలోని ప్రతి మహిళను కోటీశ్వరులుగా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర గనులు, కార్మిక శాఖ మంత్రి జి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని అందుగులపేట సాయిమిత్ర గార్డెన్స్‌లో ఇందిరా మహిళ శక్తి సంబరాలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మహిళ సంఘాలకు 17.21 కోట్ల రూపాయలను వడ్డీ లేని రుణాల చెక్కును అందించి మాట్లాడారు. నిరుపేద ప్రజల అభివృద్ధే ధ్యేయంగా తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని, అంతే కాకుండా మహిళా సంక్షేమానికి కృషి చేస్తుందని, మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతుందని ఆయన స్పష్టం చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలు వడ్డీ లేని రుణాల ద్వారా తమ వ్యాపారాలను విస్తృతం చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కాకుండా పలువురికి ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. మహిళ సమాఖ్య సంఘాలకు తోడ్పాటు అందించేందుకు మహిళా శక్తి పథకంలో బాగంగా పట్టణంలో మహిళ లకు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని బరోసా ఇచ్చారు. మహిళ శక్తి పథకంలో స్వయం సహాయక మహిళసంఘాలకు క్యాంటీన్లు, ఎలక్ట్రిక్ బస్సులు, పెట్రోల్ బంక్ లు మంజూరు చేస్తున్నామని మహిళలు వ్యాపార రంగంలో రాణించి ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గిగ్ వర్కర్స్‌కు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించే విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని, సింగరేణి సంస్థలో పని చేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం వేజెస్ పెంచేలా సింగరేణి సిఎండితో చర్చించి అమలు చేస్తానని హామీ ఇచ్చారు. చెన్నూరు నియోజక వర్గం లో 3882 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేశామని, 3880 మంది పేర్లను రేషన్ కార్డుల్లో కొత్తగా పేర్లు నమోదు చేయడం జరిగిందని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని రేషన్ కార్డులు రాని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నియోజక వర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు తొందరగా చేపట్టాలని కోరారు. అనంతరం కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అంతకు ముందు ఇందిరా మహిళా శక్తి సంబరాలకు హాజరైన మంత్రి వివేక్ కు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను జిల్లాలో అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని, సంక్షేమ పథకాల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత గల లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో, ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు మహిళల సంఘాలకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులలో ఎలాంటి జాప్యం లేకుండా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో దాదాపు 6 వేల మంది మహిళలు రుణం పొంది యూనిట్లను ప్రారంభించి నిర్వహిస్తున్నారని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి




### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, జూలై 23 (ప్రభాత సమాచారం)**

వర్షాకాలంలో ఎక్కువగా వ్యాపించే కాలానుగుణ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధవారం పట్టణంలోని బంగల్ పేట్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాల కారణంగా రోగుల సంఖ్య పెరిగే అవకాశముందని, అలాంటి పరిస్థితుల్లో వైద్యులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరై, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆసుపత్రి పర్యటన సందర్భంగా రోగుల నమోదు, రోగనిర్ధారణ పరీక్షలు, మందుల పంపిణీ వంటి అంశాలపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించి, వాటిని సమగ్రంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మందుల గదిని పరిశీలించి, అందుబాటులో ఉన్న ఔషధాల వివరాలు, గడువు తేదీలను తెలుసుకున్నారు. టీకాల గదిని తనిఖీ చేసారు. పారిశుద్ధ్యం విషయంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య స్థితి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రైవేట్ హాస్పిటళ్లలు ధీటుగా అన్ని రకాల వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వారికి భరోసా ఇచ్చారు. ఈ తనిఖీలో జిల్లా వైద్యాధికారి డా. రాజేందర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



### రాయితీ యూరియా దుర్వినియోగం
## కాకుండా చర్యలు తీసుకోవాలి

### అధికారులు తనిఖీలు నిర్వహించాలి
### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోండి
### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జూలై 23 (ప్రభాత సమాచారం)**

రైతు సంక్షేమంలో భాగంగా వ్యవసాయ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ యూరియా పక్కదారి పట్టి దుర్వినియోగం కాకుండా టాస్క్ బృందాలు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా రాయితీ యూరియాను రైతులకు అందిస్తుందని, ఇదే అదనుగా నకిలీ యూరియాను తయారుచేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనివల్ల రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ చర్యలు నివారించేందుకు మండల, డివిజన్, జిల్లాస్థాయి బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. మండల స్థాయి బృందంలో తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఉంటారని, డివిజన్ స్థాయి బృందంలో రాజస్వ మండల అధికారి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, ఎ.సి.పి./ డి.ఎస్.పి. ఉంటారని, జిల్లా స్థాయి బృందంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా వ్యవసాయ అధికారి, డి. సి.పి. ఉంటారని తెలిపారు. బృంద సభ్యులు తమ పరిధిలోని అనుమానిత తయారీ కేంద్రాలు, అనధికారక డి.ఈ.ఎఫ్. ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించాలని, తనిఖీల సమయంలో అనుమానిత యూరియా నిల్వలు లభించినట్లయితే స్వాధీన పరుచుకోవాలని, యూరియా నమూనా సేకరించి వేప నూనె పూత ఉండడంపై ల్యాబ్ పరీక్ష నిర్వహించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, బృంద సభ్యులు తాము తనిఖీ చేసిన నివేదికలు ప్రతివారం జిల్లా వ్యవసాయ అధికారికి తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు.

## విద్యా సంస్థల బంద్ సంపూర్ణం

**బెల్లంపల్లి, జూలై 23 (ప్రభాత సమాచారం)**

వామపక్ష, విద్యార్థి సంఘాల విద్యా సంస్థల బంద్ బుధవారం సంపూర్ణంగా జరిగింది. ఫీజు రియంబర్స్మెంట్, కార్పొరేట్ సంస్థల అధిక ఫీజులు, పాఠశాలు, కళాశాలల విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాలు, ఇతర విద్యార్థి సంఘాలు కలసి బంద్ కు పిలుపునిచ్చాయి. అందులో భాగంగా బెల్లంపల్లిలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు బంద్ పాటించాయి. ప్రైవేట్ విద్యా సంస్థలు సంపూర్ణంగా బంద్ పాటించగా, ప్రభుత్వ విద్య సంస్థలు పాక్షికంగా పాల్గొన్నాయి. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్యూ సంఘాలు బంద్‌ను ప్రకటించాయి. ఆర్ఎస్‌యూ కూడా బంద్‌కు పిలుపునిచ్చింది.

## ఆర్డీవో కార్యాలయం ఆస్తుల జప్తు

### భూ పరిహారం కేసులో జిల్లా కోర్టు ఉత్తర్వులు

**ఆసిఫాబాద్, జూలై 23 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సివిల్ కోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. రైతులకు రెండు కోట్ల 24 లక్షల భూ పరిహారం చెల్లింపులో జాప్యం వహించిన రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఆస్తుల జప్తుకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వాంకిడి మండలం బాంబర గ్రామ శివారులోని పెవుట చెరువు నిర్మాణం కోసం 2012లో స్థానిక రైతులను 70 ఎకరాల భూమిని ప్రభుత్వం భూ సేకరించింది. రైతులకు ఎకరానికి 80 వేల చొప్పున పరిహారం అందించారు. అయితే మార్కెట్ ధర కంటే తక్కువగా భూ పరిహారం చెల్లించారని 13 మంది రైతులు 2013లో ఆసిఫాబాద్ సివిల్ కోర్టును



ఆశ్రయించారు. దీంతో వాదోపవాదాలు విన్న కోర్టు 2020లో బాధిత రైతులకు 2కోట్ల 24 లక్షల 58 వేల భూ పరిహారం చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. రైతులకు పరిహారం చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేయడంతో ఆర్డీవో కా ర్యాలయం ఆస్తుల జప్తు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బుధవారం కోర్టు సిబ్బంది సామగ్రిని జప్తు చేశారు.

## 9న ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**దండేపల్లి, జూలై 23 (ప్రభాత సమాచారం)**

ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పెంద్రం శ్రీను అన్నారు బుధవారం దండేపల్లి మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీలు ఘనంగా జరుపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పద్మల్ పురి కాకో ఆలయ కమిటి చైర్మన్ కుడిమెత సోము, అదివాసీ సంఘాల నాయకులు రాం పటేల్, కొమురం అనంత్,అత్రం బాదు, మర్సుకొల్ల సంతోష్, శంకర్,కొర్విచెల్మ మాజీ సర్పంచ్ మంగం మాన్కు తదితరులు పాల్గొన్నారు.



# ఫుడ్‌జోన్‌పై నీలినీడలు

- నాలుగేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణపనులు
- పరిశ్రమల స్థాపనకు ముందుకురాని వ్యాపారులు
- అందుబాటులోకి వస్తే ఉపాధి అవకాశాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు





**బెల్లంపల్లి, జూలై 23 (ప్రభాత సమాచారం)**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల క్రితం బెల్లంపల్లికి ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ మంజూరైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకే ఒక్క ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ మంజూరు కావడం అది జిల్లాలోని బెల్లంపల్లికి కేటాయించడంతో స్థానికులు, జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుతో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు పలువురికి ఉపాధి అవకాశాలు, ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశించిన వారికి నిరాశే ఎదురవుతోంది. మంజూరైన నాలుగేళ్లయినా పనులు పూర్తిస్థాయిలో కాకపోవడం, మరో వైపు పరిశ్రమల స్థాపనకు వ్యాపారస్తులు ముందుకు రాకపోవడంతో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌పై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఎంతోమంది ఎదురు చూస్తున్నారు. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### నత్తనడకన నిర్మాణ పనులు

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకే ఒక్క ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌ను బెల్లంపల్లిలో ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల వెనకాల సర్వే నంబరు 170లో 350 ఎకరాల స్థలాన్ని సంబంధిత అధికారులు కేటాయించారు. ఈస్థలంలో పరిశ్రమల కోసం రహదారులు, వంతెనలు నాణ్యతతో నిర్మించకపోవడంతో వర్షాకలంలో వరదలకు రహదారులు, వంతెనలు కొట్టుకుపోయాయి. అనంతరం దాదాపు రూ.50 కోట్ల నిధులతో ఫుడ్ జోన్‌ల ఏర్పాటు చేసే పరిశ్రమల కోసం 100 ఫీట్ల రహదారులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు వివిధ నిర్మాణ పనులను సైతం చేపట్టారు. పరిశ్రమల కోసం చేసిన పనులే మళ్లీమళ్లీ చేయడంతో నిధులు నీళ్ల పాలు కావడంతో పాటు మరో వైపు సమయం వృధా అయ్యింది. ఫుడ్‌జోన్ ప్రాంతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రస్తుతం దాదాపు పూర్తి అయ్యింది. ఫుడ్ జోన్‌లో రహదారుల పక్కన డ్రైనేజీలు నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. పరిశ్రమల కోసం నీటి సరఫరా చేయాల్సి ఉంటుంది. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్ధ జలాల కోసం శుద్ధిచేసే ప్లాంటుతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణకు అనువైన షెడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు ఇందులో ఒక్కపని కూడా పూర్తి కాలేదు. ప్రధాన రహదారికి... సైతం ఇటీవలనే అనుమతులు లభించడంతో ప్రస్తు తం పనులు చేపడుతున్నారు. ఇలా నాలుగేళ్లుగా ఫుడ్‌జోన్‌కు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి.

### వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా

జిల్లాలో రైతులు పండించే పంటల ఉత్పత్తుల ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌ను మొదటగా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. జిల్లాలో ఎక్కువగా రైతులు వరి, పత్తి, పప్పు దినుసులు, మామిడి సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. ఈ పంటలకు అనుగుణంగా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో రైతులు ఉత్పత్తి చేసిన పంటలతో స్థానికంగానే ఆహార ఉత్పత్తి జరగనుంది. రైతులు పండించిన పంటలను ఫుడ్‌జోన్‌లో ఏర్పడే పరిశ్రమలకు తరలించి ఆహార ఉత్పత్తులను తయారు చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఫుడ్‌జోన్ అందుబాటులోకి రాకపోవడంతో స్థానికంగా పండించిన పంటలను ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు రైతులు తరలిస్తున్నారు. ఫుడ్‌జోన్‌ను త్వరగా అందుబాటులోకి తెస్తే స్థానిక రైతులతో పాటు పక్కనున్న జిల్లా రైతులకు మేలు జరుగుతుంది.

### ఆసక్తి చూపని వ్యాపారస్తులు

పట్టణంలో ఏర్పాటు చేసిన ఫుడ్‌జోన్‌లో పరిశ్రమల ఏర్పాటుకు వ్యాపారస్తులు ఆసక్తి చూపడం లేదు. పరిశ్రమల ఏర్పాటు కోసం నాలుగేళ్ల క్రితం ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు సంబంధించి ప్రక్రియ ప్రారంభించినప్పటికీ ఎవరు ముందుకు రావడం లేదు. ఫుడ్ జోన్‌లో రైసుమిల్లులతో పాటు బియ్యం వినియోగించి తయారుచేసే ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలు, పప్పు ధాన్యాల ఉత్పత్తులు, సోయాబీన్, జిన్నింగ్ మిల్లులతో పాటు దాదాపు 36 పరిశ్రమలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ద్వారా పరిశ్రమల కోసం వ్యాపారస్తులకు అవకాశం కల్పించినప్పటికీ ముగ్గురు మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో.. మూడు రకాల కంపెనీల ఏర్పాటుకు వ్యాపారులు ముందుకు వచ్చారు. ఢిల్లీకి సంబంధించిన కంపెనీతో పాటు స్థానికంగా ఉండే ఇద్దరు వ్యాపారులు పరిశ్రమల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఫుడ్ జోన్‌లో పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం నుంచి ఎకరానికి రూ. 40 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే వ్యాపారస్తులు భూమి ధర రెట్టింపు ఉందనే కారణంతో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అలాగే సంబంధిత అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సైతం ఫుడ్ జోన్‌లో పరిశ్రమల ఏర్పాటు కోసం వ్యాపారస్తులకు ఇప్పటి వరకు అవగాహన కల్పించిన సందర్భం లేదు. పూర్తిస్థాయిలో ఫుడ్ జోన్‌లో పరిశ్రమలు ఏర్పాటైతే స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల వారికి ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది. దీంతో పాటు స్థానిక ప్రాంతం సైతం అభివృద్ధి చెందుతుంది. కానీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం పూర్తిస్థాయిలో పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఫుడ్ జోన్‌లో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేసి ప్రారంభించే విధంగా చూడాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

---



## సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో

# గోరింటాకు వేడుకలు

### అమ్మవారికి బోనాల సమర్పణ

**మందమర్రి, జూలై 23 (ప్రభాత సమాచారం)**

ఆషాడ మాసంను పురస్కరించుకొని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు, శాకాంబరి ఉత్సవాలు, గోరింటాకు వేడుకలు లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఇల్లందు క్లబ్‌లో బుధవారం నిర్వహించిన వేడుకల్లో సింగరేణి సేవా సమితి ఏరియా అధ్యక్షురాలు స్వరూప రాణి– దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే బోనాల పండుగను సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఏడాది ఆషాడ మాసంలో వర్షాలు పడడం వలన వాతావరణం చల్లబడి ఒంట్లో వేడి అలాగే ఉంటుందని బయటి వాతావరణానికి సమానంగా మన శరీరం మారదన్నారు. గోరింటాకులో వేడిని తగ్గించే గుణం ఉందని, రోగ నిరోధక శక్తిని పెంచిరక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుందన్నారు. అనంతరం ఏరియా అధికారుల సతీమణులు, మహిళలు, యువతులతో గోరింటాకు వేడుకల్లో పాల్గొన్నారు. అంతకు ముందు మహిళలు అమ్మవారికి ఆషాఢ మాసం బోనాలను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ స్వరూప రాణి, సెక్రెటరీ మణి, ట్రెజరర్ కవిత, జాయింట్ ట్రెజరర్, సుజాత, కమిటీ సభ్యులు సుల్తానా, శ్రీలత, రాధిక పాల్గొన్నారు.

---

# సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల, జూలై 23 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని రైస్ మిల్లులకు కేటాయించిన సి.ఎం.ఆర్. లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్యతో కలిసి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సి.ఎం.ఆర్. లక్ష్యాల సాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైస్ మిల్లులకు సామర్థ్యానికి అనుగుణంగా సి.ఎం.ఆర్. లక్ష్యాలను కేటాయించడం జరిగిందని, ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2023 - 24 సంవత్సరం రబీ కి సంబంధించిన సి.ఎం.ఆర్. లక్ష్యాలను ఈ నెల 27వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. 2024 - 25 సంవత్సరం రబీకి సంబంధించి సి.ఎం.ఆర్. ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. డిఫాల్టర్ రైస్ మిల్లులకు ధాన్యాన్ని కేటాయించడం జరగదని, లక్ష్యసాధనలో అలసత్వం వహించిన రైస్ మిల్లర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ధాన్యం కేటాయించిన రైస్ మిల్లులను సందర్శించి కేటాయించిన ప్రకారం ధాన్యం నిల్వల వివరాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని తెలిపారు. రైస్‌మిల్లర్లు సీఎంఆర్ లక్ష్య సాధనలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మా రావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్మాసు కాంతయ్య, రైస్ మిల్లుల యజమానులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# శరవేగంగా మూడో రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు

- పలు రైళ్ల నిలిపివేత
- 25 నుంచి 27 వరకు రైళ్ళు రద్దు

**బెల్లంపల్లి, జూలై 23 (ప్రభాత సమాచారం)**

మూడో రైల్వే ట్రాక్ పనుల నేపథ్యంలో పలు రైళ్లను నిర్మించారు. నిర్మాణ పనుల రీత్యా పెద్దపల్లి రైల్వే బైపాస్ మార్గంలో నడిచే పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 25 నుంచి 27 తేదీన వరకూ రైళ్ల రాకపోకలు ఉండవు. సిర్పూర్ టౌన్ - కరీంనగర్, కరీంనగర్- సిర్పూర్ టౌన్, కాజీపేట్ -సిర్పూర్ టౌన్, బల్లార్షా - కాజీపేట్, కాజీపేట్ - బల్లార్షా, సికింద్రాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్, రైళ్లను రద్దు చేశారు. మరికొన్ని సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్‌లను రీరూట్ చేస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే కి చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ ప్రకటించారు. నిర్మాణ పనుల కారణంగా రైళ్ల రాకపోకల నిలిపివేత వల్ల నెలకొన్న అసౌకర్యాన్నీ ప్రయాణికులు సహకరించాలన్నారు. రైలు నిలిపివేత తేదీల్లో ప్రజలు ప్రయాణాన్ని రద్దు చేసుకోవాలన్నారు.





### విద్యార్థుల ఆరోగ్యంపై
# ప్రత్యేక దృష్టి సారించాలి

- విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాలి..
- వంటకు నాణ్యమైన సామగ్రి ఉపయోగించాలి
- వసతి గృహాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి
- కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్, జూలై 23 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కెరమెరి మండల కేంద్రంలో గల వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించి వంటశాల, వంటకు వినియోగిస్తున్న సరుకుల నాణ్యత, సామాగ్రినిలో చేసే గది పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యారంగా అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యా అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, వంటలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితులలో నాసిరకం సరుకులు, కాలం చెల్లిన సరుకులను వినియోగించకూడదని, ఒకవేళ వినియోగించినట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వసతి గృహాన్ని ప్రతిరోజు శుభ్రపరచాలని, విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యమైన గుడ్లను వినియోగించాలని, వంట వాడే సరుకులను క్రమ పద్ధతిలో నిల్వ చేయాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బ్లాంకెట్లు అందించారు. అనంతరం మండల కేంద్రంలోని హాక సేవా కేంద్రాన్ని సందర్శించి యూరియా నిల్వలు, స్టాకు రిజిస్టర్ ను పరిశీలించారు. రైతులకు పంట సాగులు ఎలాంటి ఇబ్బందులు రాకుండా యూరియా, ఇతర పిచికారి మందులు అందుబాటులో ఉంచాలని, ఎట్టి పరిస్థితులలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతులకు యూరియా, ఇతర మందుల వినియోగంపై అవసరమైన సూచనలు అందించాలని, నిషేధిత గడ్డి మందుల వాడకాన్ని నియంత్రించాలని తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. సిర్పూర్ (యు) వ్యవసాయ సంచాలకులు వెంకటి, మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారి, హాక కేంద్రం నిర్వహకులు, రైతులు పాల్గొన్నారు.



### పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం
# దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సిహెచ్. దుర్గాప్రసాద్**

**మంచిర్యాల, జూలై 23 (ప్రభాత సమాచారం)**
2025 - 26 విద్యా సంవత్సరానికి గాను పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కొరకు విద్యార్థుల నుండి దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సిహెచ్. దురాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్న అర్హులైన షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ విద్యార్థిని, విద్యార్థులు నూతన/ రెన్యువల్ పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కొరకు ఆన్‌లైన్‌లో ఈ - పాస్ వెబ్ సైట్ http://telanganaepass. cgg.gov.in ద్వారా సెప్టెంబర్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్థులు తమ బ్యాంకు ఖాతా వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని, ఆయా కళాశాలల యాజమాన్యాలు ఉపకార వేతనాల నమోదు ప్రక్రియ 100 శాతం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2022- 23, 2023 - 24 విద్యా సంవత్సరాల పోస్ట్ మెట్రిక్ హార్డ్ కాపీలను జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్న అర్హులైన షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ విద్యార్థిని, విద్యార్థులు అర్హులని తెలిపారు.

# గ్రామాల్లో విద్యుత్ దీపాల ఏర్పాటు చర్యలు



**ఆసిఫాబాద్, జూలై 23 (ప్రభాత సమాచారం)**
గ్రామాలలో విద్యుత్ దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మాజీ జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు అన్నారు. ఆసిఫాబాద్ మండలంలోని హీరాపూర్ గ్రామంలో బుధవారం ఎంపీ నిధులతో మంజూరైన ఎల్ఈడీ విద్యుత్ దీపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో హీరాపూర్ గ్రామంలో పర్యటించినప్పుడు గ్రామంలో ఎల్ఈడీ దీపాలు లేక వర్ష కాలం రాత్రి సమయాలలో ఇబ్బందులు ఎదురుకుంటున్నారని తమ దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఎంపీ గేడం నాగేష్ దృష్టికి తీసుకువెళ్లి ఎంపీ నిధులతో ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 40 లక్షల రూపాయల నిధులతో త్వరలోనే ఆసిఫాబాద్ పట్టణంలో ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. నాయకులు దీపక్ రావ్,శ్రీకాంత్ తదితరులున్నారు.

# ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



**మందమర్రి, జూలై 23 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ఫెర్టిలైజర్ డీలర్లు ఎరువులను నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా, ఇతర ఎరువులను కలిపి అమ్మినా కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి హెచ్చరించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను, పిఎసిఎస్ గోదామును బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాలలో స్టాక్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, ఎరువుల డీలర్లకు పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రతీ ఎరువుల దుకాణములో స్టాకు నిలువలు ధరల పట్టిక తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. రైతులు యూరియా, ఎరువుల కొరకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వానాకాలం సీజన్ కు గాను సరిపడా స్టాకును జిల్లా వ్యవసాయ శాఖ ద్వారా ఎప్పటికప్పుడు తెప్పించడం జరుగుతుందని స్పష్టం చేశారు. రైతులు అధిక మోతాదులో ఎరువులను వాడి పంట భూములను నిస్సారం చేయకూడదని అదే విధంగా రైతులు నానో యూరియా, నానో డీఎపీ లపై మొగ్గు చూపాలని కోరారు. ప్రస్తుత వానాకాలం సీజన్ కు గాను రైతులకు కావలసినవి అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. వ్యవసాయానికి సంబంధించన సందేహాలు, సలహాలకు మండల వ్యవసాయ అధికారి, లేదా విస్తరణ అధికారిని సంప్రదించాలన్నారు.



### నిరుద్యోగ యువతకు
# ఉపాధి కల్పించే దిశగా చర్యలు

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, జూలై 23 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో టాస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళా కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, టాస్క్ మేనేజర్ సాయికుమార్, వివిధ సంస్థల ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు అనేక చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. బుధవారం నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో 316 మంది నిరుద్యోగ యువత హాజరు కాగా 45 మంది అభ్యర్థులను వివిధ సంస్థలలో ఉపాధి కల్పించేందుకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు భవిష్యత్తులో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించడం జరుగుతుందని, అర్హత గల అభ్యర్థులు జాబ్ మేళా అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దు

### మావల, జైనథ్ గురుకుల కళాలలను రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జూలై 23 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని మావల, జైనథ్ మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలను బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేశారు. మావల బాలురు వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భోజనం, ఉండేందుకు వసతి, హాస్టల్ శుభ్రత, తాగునీరు, విద్యుత్ సరఫరా, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాల పై పాఠశాల గదులు, డార్మెటరి, వంట గది, బియ్యం నిల్వలను, మెనూ పట్టికను, బోర్ వెల్, ఆర్ఓ



ప్లాంట్ నీటి పరీక్షలను పరిశీలించారు.. గత ఏప్రిల్ మాసంలో ఉన్న పాత స్టాక్ బియ్యాన్ని వాపస్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పాత స్టాక్ ఉన్న కారణంగా బియ్యంలో పురుగులు వస్తాయని, కొత్త స్టాక్ బియ్యాన్ని వాడుకోవాలని, పాత స్టాక్‌ను రీప్లేస్మెంట్ చేయాలనీ, నాణ్యతతో కూడిన సరుకులను వాడాలని, విద్యార్థులకు ఇస్తున్న క్వాంటిటీని తగ్గించకుండా ఇవ్వాలనిన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వసతి గృహం విద్యార్థులకు సురక్షితంగా, ఆరోగ్యంగా, శుభ్రంగా ఉండేలా, అభ్యాస సామర్థ్యాల ను పెంపొందించేలా అన్ని చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ ఇంఛార్జి నారాయణ, కీర్తిని ఆదేశిస్తూ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం సహించొద్దని స్పష్టం చేశారు.



## సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా
# ముందస్తు జాగ్రత్త చర్యలు

- ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు
- గిరిజన బాలికల వసతి గృహ విద్యార్థినులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్న కలెక్టర్
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల, జూలై 23 (ప్రభాత సమాచారం)**

వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డి, ఆర్.ఎం.ఓ.లు భీష్మ, శ్రీధర్ లతో కలిసి సందర్శించి వార్డులు, ల్యాబ్, ప్రజలకు అందిస్తున్న ఆహారం నాణ్యత, వైద్య సేవలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రిలో అవసరం అయినా వైద్య పరికరాల కొరకు అందించిన ప్రతిపాదనలను పరిశీలించడం జరుగుతుందని, ప్రతిరోజు 800 నుండి 1 వేయి మంది ప్రజలు ఆసుపత్రి ద్వారా వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రిలో అప్పటి అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని, అధునాతన సాంకేతిక పరికరాలు, వార్డులు ఇతర అన్ని సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణం కొనసాగుతుందని తెలిపారు. రోగులకు అందిస్తున్న ఆహార నాణ్యత పరిశీలించడం జరిగిందని, ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. జిల్లాలో జ్వరం వార్డును ఏర్పాటు చేసి 150 పడకలను అందుబాటులో ఉంచడం జరిగిందని, బెల్లంపల్లి, చెన్నూర్ లలో గల 100 పడకల సామాజిక ఆసుపత్రులు, లక్షెట్టిపేట మండల కేంద్రంలో గల 30 పడకల సామాజిక ఆసుపత్రిలో జ్వర బాధితుల కొరకు ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పక్క జిల్లా అయిన ఆసిఫాబాద్, పక్క రాష్ట్రం లోని సిర్వంచ నుండి 4 మంది మలేరియా బాధితులు వైద్య సేవలు పొందుతున్నారని, జిల్లాలో మలేరియా కేసులు లేవని తెలిపారు. బయట నుండి వచ్చిన వారి ద్వారా మలేరియా వ్యాప్తి చెందకుండా నియంత్రణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు నీటి నిల్వలను తొలగించడం, బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్ పిచికారి చేయడం వంటి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని, వ్యాధుల నియంత్రణపై పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి, హాజీపూర్ మండలం గుడిపేటలో నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ వైద్య రంగాన్ని బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు.

---



## మధ్యాహ్న భోజనంలో
# నాణ్యత పాటించాలి

**కుభీర్, జూలై 23 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యతను విస్మరించొద్దని ఎంపీఓ మోహన్ సింగ్ నిర్వాహకులకు సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రం కుబీర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. మండలంలోని గాలిసింగ్ తండా ఖీరు నాయక్ తండలోని పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు.

## పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి

**నిర్మల్, జూలై 23 (ప్రభాత సమాచారం)**

ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం గ్రంథాలయాలు ఏర్పాటు చేసి విజ్ఞానం పాఠంపై ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. బుధవారం నిర్మల్ పట్టణంలోని నారాయణ స్కూల్లో గ్రంథాలయాల నిర్వాణపై ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతులను ప్రారంభించారు. వివిధ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎంఈఓలు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



---

# రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలి





**ఎరువుల దుకాణాలు తనిఖీ చేసిన నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్, జూలై 23 (ప్రభాత సమాచారం)**

రైతులకు ఎరువుల కొరత రాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ మినీ ట్యాంక్‌బండ్ సమీపంలోని గాయత్రి ఫర్టిలైజర్‌తో పాటు కొండాపూర్ గ్రామంలోని శ్రీ సాయి ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాలలో ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ప్యాకింగ్ లేబుళ్లు, తయారీదారుల వివరాలు, గడువు తేదీలు, రిజిస్టర్లు, రసీదుల పుస్తకాలను పరిశీలించారు. అన్ని రికార్డులు సరిగ్గా నిర్వహించాలని యజమానులకు సూచించారు. రైతులకు అవసరమైన పరిమాణంలో మాత్రమే ఎరువులు విక్రయించాలన్నారు. ఎరువుల కొనుగోలుకు వచ్చిన రైతులతో మాట్లాడిన కలెక్టర్, వారి సాగు చేసిన పంటలు, భూమి విస్తీర్ణం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు నకిలీ విత్తనాలు, మందులు కొనకూడదని, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అదే విధంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు భూసారానికి అనుగుణంగా వాడాలని, అధికంగా వాడితే దిగుబడిపై ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యవసాయ శాఖాధికారి అంజి ప్రసాద్, తహసీల్దార్లు రాజు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

---

# విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేసిన మాజీ సర్పంచ్

## కేటీఆర్ గిఫ్ట్ ఏ స్మైల్ స్ఫూర్తి..

**ఇచ్చోడ, జూలై 23 (ప్రభాత సమాచారం)**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గిఫ్ట్ ఏ స్మైల్ స్ఫూర్తితో మాజీ సర్పంచ్ తనవంతు సాయం చేశారు. ఇద్దరు నిరుపేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఆదిలాబాద్ జిల్లా ముఖరా (కే) గ్రామానికి చెందిన ప్రవళిక, మాధవ్ ఇద్దరికీ చదువుల కోసం గాడ్గే మీనాక్షి ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా గాడ్గే మీనాక్షి మాట్లాడుతూ.. కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందజేశానని తెలిపారు. గ్రామంలో కేటీఆర్ అన్న జన్మదినాన్ని పురస్కరించుకొని వారం రోజుల క్రితం 24 మంది బాలింతలకు కేసీఆర్ కిట్లను అందజేశామని, కేసీఆర్ నాయకత్వంలో కేటీఆర్ అన్న అడుగుజాడల్లో పని చేస్తామని



తెలిపారు. కేటీఆర్ అన్న ఆశయాలను కొనసాగిస్తామన్నారు, గ్రామంలో ఎవరికి ఏ అవసరం ఉన్నా "గిఫ్ట్ ఏ స్మైల్"లో భాగంగా సహాయం చేస్తామని అన్నారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్ పాల్గొన్నారు.

---

## 'సమస్యల పరిష్కారానికి సహకరించాలి'

**ఉట్నూర్, జూలై 23 (ప్రభాత సమాచారం)**

సమస్యల పరిష్కారానికి అందరూ సహకరించాలని ఉట్నూరు మండలం నూతన ఎస్సై కొట్టే ప్రవీణ్ సూచించారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సైని ఆటో యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎస్సై ప్రవీణ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు బాపురావ్, సభ్యులు రవి, హైదర్, నదీమ్, ముజాయిద్ ముఖిద్, సుంగు, గణేష్ ఇస్తాకర్ పాల్గొన్నారు.



# వన మహోత్సవాన్ని పూర్తి చేయాలి

## అధికారులతో సమీక్షా సమావేశంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, జూలై 23 (ప్రభాత సమాచారం)

పచ్చదనం పెంపే లక్ష్యంగా జిల్లాలో వన మహోత్సవ కార్యక్రమాన్ని వేగవంతంగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వన మహోత్సవం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వనమహోత్సవంలో భాగంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో విరివిగా మొక్కలు నాటాలని ఆదేశించారు. జిల్లాలో ఈ సంవత్సరం 69 లక్షలు 55వేల మొక్కలు నాటేలా ప్రణాళికలను రూపొందించడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు ఆయా శాఖల ఆధ్వర్యంలో 44 శాతం మొక్కలు నాటడం జరిగింది అని తెలిపారు. శాఖల వారిగా నాటిన మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, రాబోయే 15 రోజులలోపు మొక్కలు నాటే ప్రక్రియను పూర్తిచేయాలని, ప్రతి మొక్కను జియోట్యాగ్ చేయాలని స్పష్టం చేశారు. హార్టికల్చర్ మొక్కల నాటుదలకు వ్యవసాయ శాఖ సహకారం తీసుకోవాలని ఎంపీడీఓలకు సూచించారు. మొక్కలు నాటిన వెంటనే సంబంధిత వివరాలు అటవీ శాఖ అధికారులకు



పంపించాలని అన్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై సమీక్షించిన కలెక్టర్, వెంటనే నిర్మాణాలను పూర్తి చేయాలని, మార్కౌట్ పూర్తి చేసిన ఇండ్లకు గ్రౌండింగ్ పనులు తక్షణమే ప్రారంభించాలన్నారు. మేస్త్రీల కొరత ఉండకుండా తగిన సన్నాహాలు చేసుకోవాలని సూచించారు. ఇసుక కొరత రాకుండా తహసీల్దార్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకానికి సంబంధించి లబ్ధిదారుల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ నాగిని భాను, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్ రెడ్డి, డీఈఓ పి. రామారావు, జెడ్పి సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఆర్. సుదర్శన్ సహా పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.





## వైభవంగా దుర్గ భవాని

# ఆలయం బోనాల జాతర

మందమర్రి, జూలై 23 (ప్రభాత సమాచారం)

పట్టణంలోని స్థానిక కేకే-1 సిఎస్పీ ప్రాంతంలోని దుర్గ భవానీ ఆలయం ఆధ్వర్యంలో బుధవారం ఆషాఢ మాసం బోనాల జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బోనాల జాతర సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పట్టణంలోని వెంకటేశ్వర దేవస్థానం నుండి ఆలయం వరకు బోనాలతో, పోతురాజు వేషధారణలతో, డప్పు చప్పుళ్ళతో, కోలాటం, ఆటపాటలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ సిఐ కే శశిధర్ రెడ్డి, ఎస్ఐ ఎస్ రాజ శేఖర్ లు ముఖ్య అతిథులుగా హాజరై, బోనాలను ఎత్తుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి నర్సింగ్ భవాని మాట్లాడుతూ, భక్తులకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, పాడిపంటలు, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించాలని అమ్మ వారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం భోజనం అందించాలి

జైనూర్, జూలై 23 (ప్రభాత సమాచారం)

మైనార్టీ రెసిడెన్షియల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి యం.ఎ. నదీమ్ అహ్మద్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలో గల తెలంగాణ మైనారిటీ బాలికల పాఠశాలను జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నదీమ్ అహ్మద్ సందర్శించి వంటశాల, నిత్యావసర సరుకుల నాణ్యత, బియ్యం నిల్వలు, వండిన ఆహారాన్ని పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, వంట సరుకులను క్రమ పద్ధతిలో అమర్చుకొని వంటలు వినియోగించాలని తెలిపారు. ప్రతిరోజు మెనూ ప్రకారం విద్యార్థినులకు పోషకాహారం అందించాలని, విద్యార్థినిలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండే విధంగా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని, విద్యార్థులకు



నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ మల్లేశ్వరి ఉన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

నిర్మల్, జూలై 23 (ప్రభాత సమాచారం)

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్మల్ అర్బన్ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. విద్యారంగాన్ని ప్రభుత్వం ప్రవేటీకరణ చేసేందుకు చేస్తున్న కుట్రలను ఆపాలని ప్రభుత్వ పాఠశాలలో మెరుగు సదుపాయాలు కల్పించాలని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు




విజయకుమార్, మిరాజ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు క్రాంతికుమార్, మనోహర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే చేసిందేమీ లేదు

- శిలాఫలకం తొలిగించడం ఎంతవరకు న్యాయం
- ఇందిరమ్మ ఇండ్లలో అవినీతి నిజం కాదా..?
- ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఎందుకు ఓపెన్ చేయడం లేదు
- ఆసుపత్రి సందర్శనలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి

లక్షెట్టిపేట, జూలై 23 (ప్రభాత సమాచారం)

పట్టణంలోని 30 పడకల ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నిర్మాణానికి ప్రస్తుత ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు చేసింది ఏమీ లేదు అని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు మండిపడ్డారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 30 పడకల సామాజిక ఆసుపత్రికి బీజం పడిన మాట నిజం కదా? అని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావును ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తి చేసుకుని అసెంబ్లీ సాధారణ ఎన్నికల అనంతరం ప్రారంభమైనంత మాత్రాన కర్త, కర్మ, క్రియ నేనే అని చెప్పుకోవడం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకే దక్కిందని ఎద్దేవా చేశారు. అప్పటి ఎమ్మెల్యేగా ఉండి కనీసం లక్షెట్టిపేట వైపు కన్నెత్తి చూడని ప్రేమ్ సాగర్‌రావుకు ఈ ఆసుపత్రి నిర్మాణంతో ఏలాంటి సంబంధం లేదని నొక్కి చెప్పారు. అప్పటి ఎమ్మెల్యేగా ఉండి 2013లో తాను రాసిన లెటర్ ద్వారా ఈ ఆసుపత్రి నూతన భవనం మంజూరైనట్లు చెప్పుకోవడం ప్రేమ్‌సాగర్‌రావు మోసపూరిత తనానికి నిదర్శనమన్నారు. మాహయాంలో ఆరోగ్యశాఖ మాజీ మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా రూ. 8 కోట్లపై చిలుకు నిధులతో నిర్మిస్తే ఇప్పుడు చివరి దశలో ఓపెనింగ్ చేసి సొమ్ము కరిది సోకొకరిదనే ప్రవర్తన ప్రేమ్ సాగర్ రావులో కనిపిస్తుందని వ్యంగాస్త్రాలు సంధించారు. జిల్లా అధికారులు కూడా మా ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఆసుపత్రి శిలాఫలకంను ఏ నిబంధనల మేరకు తొలగించారో తెలపాలని, వెంటనే మా శిలాఫలకంను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే ఇంటిగ్రెటెడ్ మార్కెట్‌ను ఎందుకు ప్రారంభించడం లేదో జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లలో అవినీతి లేదని కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ పెట్టి చెప్పడం వింతగా ఉందన్నారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు చెప్పేవి అన్ని అబద్దాలని మా ప్రభుత్వ హయాంలోని పనులను తన ఖాతాలో వేసు కోవడం ఎంత వరకు న్యాయమో ప్రజలు తెలుసన్నారు.

# హత్య కేసును ఛేదించిన పోలీసులు

- డబ్బుకోసమే వృద్ధుని హత్య..!
- కత్తితో వృద్ధుడిగొంతుకోసి హత్య చేసిన నిందితుడు
- నిందితుడి అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలింపు..
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ అవినాష్
- పోలీసు సిబ్బంది అభినందించిన ఎస్పీ జానకీ షర్మిల

ముథోల్, జూలై 23 (ప్రభాత సమాచారం)

కుభీర్ మండలంలోని చాత గ్రామంలో జూలై 17 అర్ధరాత్రి బలరాం గౌడ్ అనే వృద్ధుడు రక్తపు హత్యకు గురైన విషయం విధితమే. బుధవారం ఈ ఈ హత్యకు సంబంధించిన పలు విషయాలు ఏఎస్పీ అవినాష్ కుమార్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వృద్ధుని కుటుంబీకులు, బంధువుల శుభకార్యం నిమిత్తం వేములవాడకి వెళ్లగా.. వృద్ధుడు బలరాం గౌడ్ బట్టి వ్యాపారాన్ని చూసుకుంటూ ఇంటివద్దే ఉండిపోయాడు. చాత గ్రామంలో కూలీగా పనిచేసుకుంటున్న సిల్వల సంతోష్ (45) డబ్బుల కోసం జూలై 17 అర్ధరాత్రి కత్తితో వృద్ధున్నీ దారుణంగా గొంతు కోసి హత్య చేసి, రూ.1 లక్ష యాభై వేలు తీసుకుని పరారయ్యాడు. జిల్లా ఎస్.పి జానకి షర్మిల సూచనల మేరకు ఈ ఘటనలో చాకచక్యంగా వ్యవహరించినటువంటి రూరల్ సీఐ నైలు, రూరల్ ఎస్.ఎచ్.ఓ శంకర్, భైంసా సి.ఐ గోపీనాథ్, కుబీర్ ఎస్సై కృష్ణారెడ్డి, దిలావర్ పూర్ ఎస్. ఐ రవీందర్ తదితర పోలీస్ సిబ్బంది క్లూ టీమ్స్, సెల్ సిగ్నల్, సి.సి.ఎస్ టీమ్, ఫింగర్ ప్రింట్ ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుని అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం నిందితుని వద్ద రూ.1 లక్ష యాభై వేలను రికవరీ చేశామన్నారు. అలాగే నిందితుని వద్ద ఒక



చిన్న కత్తి, పెద్ద కత్తి, గొడ్డలి, మొబైల్ ఫోన్ లభ్యం అయ్యాయని తెలిపారు. నిందితునిపై గతంలో 2008 సంవత్సరంలో నిజామాబాద్ జిల్లా బాల్కొండ స్టేషన్ పరిధిలో సైతం కేసు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

**ఆసిఫాబాద్, జూలై 23 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం కెరమెరి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలు, రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో పారిశుద్ధ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వర్షాకాలంలో అంటూ వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల



సమయపాలన పాటించాలని సూచించారు. తఅనంతరం మండలంలోని మోదీ గ్రామంలో గల ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి మౌలిక వసతులు, తరగతి గదిలో విద్య బోధన పరిశీలించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు స్వయంగా పాఠాలు బోధించారు. బోధన సమయంలో ఉపాధ్యాయులు చెప్పే విషయాలను విద్యార్థులు ఏకాగ్రతతో వినాలని, ఆసక్తిగా చదవాలని తెలిపారు. ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బుగ్గ దేవాలయం
# హుండీ లెక్కింపు
### రూ.52974 వేల ఆదాయం

**బెల్లంపల్లి, జూలై 23 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి దేవాలయం హుండీ లెక్కింపును బుధవారం ఆలయంలో నిర్వహించారు. ఆలయ హుండీ పర్యవేక్షణ అధికారి ముక్తారవి, కార్య నిర్వహణ అధికారి బాబిరెడ్డి సమక్షంలో దేవాలయం హుండిలెక్కింపు జరిగింది. ఈ లెక్కింపును ఆలయానికి రూ.52974 వేల నగదు అధికారులు వచ్చినట్లు తెలిపారు. హుండీ లెక్కింపులో దేవాలయం అర్చకులు శ్రీ రాంబట్ల వేణుగోపాల శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదుగాలి
### ఎమ్మెల్యే రామారావు పటేల్



**కుభీర్, జూలై 23 (ప్రభాత సమాచారం)**

మహిళలు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళ శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆకాంక్షించారు. బుధవారం కుభీర్ మండల కేంద్రానికి చెందిన గోరేకర్ అంజన అనే యువతికి ఆ పథకం ద్వారా మంజూరైన కుట్టు మిషన్ ను మండల నాయకులతో కలిసి భైంసా పట్టణంలోని తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గల స్వయం సహాయక సంఘాలు ప్రభుత్వం ద్వారా తీసుకున్న రుణాల ద్వారా చిన్నచిన్న వ్యాపారాలను ప్రారంభించి ఆర్థికంగా ఎదిగినప్పుడే సంఘంతో పాటు సంఘంలోని సభ్యులు బలోపేతం అవుతారన్నారు. స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేరి ప్రభు త్వం అందించే పథకాలను అందిపుచ్చుకోవాలని కోరారు.

## ఘనంగా ఎల్లమ్మ తల్లి బోనాలు

**కాసిపేట, జూలై 23 (ప్రభాత సమాచారం)**

కాసిపేట మండలంలోని సోమగూడెం గ్రామంలో బుధవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. సోమగూడెంతో పాటు చుట్టు పక్కల గ్రామాల మహిళలు భారీగా తరలి వచ్చారు. గ్రామంలో డప్పుచప్పుల్లు, నృత్యాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలా గౌడ్, రాజ్య లక్ష్మి, వెంకట లక్ష్మి, కొయ్యాడ శ్రీనివాస్, తోడేటి ప్రశాంత్, రామా గౌడ్, మహిళలు భారీగా పాల్గొన్నారు.



## మెగా జాబ్ మేళా కరపత్రాల ఆవిష్కరణ



**జైనూర్, జూలై 23 (ప్రభాత సమాచారం)**

ఈనెల 25వ తేదీన ఉట్నూర్ మండల కేంద్రంలోని పెర్కగూడ జే.సి.ఎన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించే మెగా జాబ్ మేళాకు నిరుద్యోగులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖిత్ విజ్ఞప్తి చేశారు. బుధవారం జైనూర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మేళాకు 50 కి పైగా నేషనల్, ఇంటర్నేషనల్ కంపెనీలు వస్తున్నాయని, సుమారు వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పించటం జరుగుతుందని అన్నారు. పదో తరగతి నుంచి మొదలుకుని బీటెక్, ఎంబీఏ, తదితర కోర్సులు చదివిన వాళ్లందరు హాజరుకావచ్చని తెలిపారు. ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వీధి వ్యాపారులకు ఉచితంగా గొడుగులు పంపిణీ

**నిర్మల్, జూలై 23 (ప్రభాత సమాచారం)**

వర్షాకాలం భారీ వర్షాల నేపథ్యంలో నిత్యం ఎండకు, వానకు ఉంటూ ఉపాధి కోసం అల్లాడుతున్న చిరు వ్యాపారులకు తమవంతుగా జిల్లా కేంద్రానికి చెందిన వైద్యుడు చిటికేశి శ్రీనివాస్ సాయం అందించారు. జిల్లా కేంద్రానికి చెందిన నిర్మల వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక గాంధీ కూరగాయల మార్కెట్లో బుధవారం ఉదయం వంద గొడుగులను పంపిణీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో చిరు వ్యాపారులకు ఇబ్బంది కలుగకూడదని తమవంతు ప్రయత్నం చేసినట్లు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కూన రమేష్, గంగిశెట్టి ప్రవీణ్, సభ్యులు చార్టెడ్ అకౌంటెంట్ సాయి ప్రసాద్, శ్రీధర్, హరీష్, మహేష్, వినోద్, నిఖిల్, గజేందర్, మొయిజ్, అనూప్ తదితరులు పాల్గొన్నారు.





## కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్
# చెక్కుల పంపిణీ

**దహేగాం, జూలై 23 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం 51 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే హరీష్ బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను ఆడపిల్లల పెళ్లి కోసం మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ పథకంతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు పిలుపునిచ్చారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాలలో ఏ సమస్య ఉన్న తనకు కానీ, సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో షరీఫ్, జూనియర్ అసిస్టెంట్ విజయ్, సింగిల్ విండో చైర్మన్ తిరుపతి గౌడ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ ప్రభాకర్ గౌడ్, భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా పని చేయాలి



**పెంచికల్‌పేట, జూలై 23 (ప్రభాత సమాచారం)**

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఐక్యంగా పని చేయాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ పార్ట కార్యకర్తలతో బుధవారం స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కార్యకర్త నుంచి ఎన్నికల్లో వార్డు సభ్యుల నుంచి మొదలుకొని సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ వరకు గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశనం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్ని గ్రామ స్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ మండల కేంద్రంలోని రైతు వేదికలో 33 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కళ్యాణలక్ష్మితో పాటు సీఎంఆర్ఎఫ్ కూడా సద్వినియోగం చేసుకోవాలని అ న్నారు. ఎడ తెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉం డాలన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, ఏవో మనీషా, నాయకుల రాజేశ్వర్, సత్యనారాయణ, నాగేష్, గణ పతి, పురుషోత్తం, భుజంగరావు, శోభన్, శ్రీకాంత్, హరీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

**ల్లదహేగాం, జూలై 23 (ప్రభాత సమాచారం)**

ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలనే సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే పాల్వాయిహరీష్ బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడర తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంఇ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. కోత్మీర్- దహెగాం డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన చేపడుతుండడంతో చర్యలకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, అదే విధంగా బొప్పరం గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణ పనులకు టెండర్లు పూర్తి అయ్యాయని త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. దహెగాం మండలంలో 51 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మునావర్ షరీఫ్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిగౌడ్, వైస్ చైర్మన్ ధనుంజయ్, నాయకులు ప్రభాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## సంధ్య థియేటర్ దగ్గర పవన్ ఫ్యాన్స్ హంగామా..



ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల ప్రజలు హరిహర వీరమల్లు ఊపుతో ఉన్నారు. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన సినిమా చాలా రోజులు తర్వాత విడుదల అవుతోంది. అది కూడా ఆయన డిప్యూటీ సీఎం అయ్యాక విడుదల అవుతున్న మొదటి సినిమా. దీంతో పవన్ ఫ్యాన్స్ పండుగ చేసుకుంటున్నారు. చాలాచోట్ల ర్యాలీలు, పాలాభిషేకాలతో హల్ చల్ చేస్తున్నారు. బుధవారం రాత్రి 9.30కు చాలాచోట్ల హరిహర వీరమల్లు సినిమా ప్రివ్యూ పడింది. హైదరాబాద్ లోనే ఈ షోలు ఎక్కువగా పడ్డాయి. అయితే సినిమాలకు ఫేమస్ అయిన ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని సంధ్య థియేటర్ వద్ద పవన్ ఫ్యాన్స్ భారీగా చేరుకున్నారు. దీంతో థియేటర్ ముందు ఎప్పటిలానే హంగామా నెలకొంది. కానీ పుష్ప 2 ఘటనను పోలీసులు ఇంకా మర్చిపోలేదు. దీంతో ఇప్పుడు హరిహర వీరమల్లు సినిమా ప్రివ్యూ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీగా బందోబస్తు నిర్వహిస్తున్నారు. కేవలం టికెట్ ఉన్న వారిని మాత్రమే థియేటర్ లోపలికి అనుమతిస్తున్నారు. థియేటర్ లోపల కూడా ఎలాంటి అల్లర్లు జరగకుండా కాపలా కాస్తున్నారు. థియేటర్ చుట్టుపక్కల జనాలు గుమిగూడకుండా అందరినీ పంపించేస్తున్నారు. ప్రివ్యూ అయిపోయిన తర్వాత ఫ్యాన్స్ హడావుడి చేయవచ్చిన పోలీసులు భావిస్తున్నారు. ర్యాలీలు నిర్వహించే అవకాశం ఉందని అంటున్నారు. అయితే అలాంటి వాటికి పర్మిషన్ ఇవ్వడం లేదని...ఈసారి ఎలాంటి తప్పు జరగకుండా చాలా స్ట్రిక్ట్ గా ఉంటున్నామని పోలీసులు చెబుతున్నారు.






## టీజర్ అదిరింది

ఈరోజు కోలీవుడ్ స్టార్ హీరో సూర్య పుట్టినరోజు సందర్భంగా ఆయన తదుపరి ప్రాజెక్ట్ ని అనౌన్స్ చేశారు. 'కరుప్ప' టైటిల్ తో తెరకెక్కిన ఈ చిత్రానికి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించారు. ఈ మేరకు ఫస్ట్ లుక్ తో పాటు టీజర్ విడుదల చేశారు. టీజర్ సూర్య మాస్ ఎంట్రీ, డైలాగ్స్ ఫ్యాన్స్ కి కిక్కెకించేలా ఉన్నాయి. నల్ల చొక్కా, లుంగీ ధరించి .. నోట్లో సిగరెట్ తో మాస్ అవతార్ లో కనిపిస్తున్నాడు. ఇందులో సూర్య ఒక లాయర్ పాత్రలో కనిపిస్తూనే.. మరోపక్కఒక పల్లెటూరి మాస్ కుర్రాడిగా అలరిస్తున్నారు. సూర్య 45వ చిత్రంగా రాబోతున్న ఈ సినిమాను డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్ పై ఎస్.ఆర్.ప్రభు, ఎస్.ఆర్.ప్రకాష్ బాబు నిర్మిస్తున్నారు. 2024లోనే చిత్రీకరణ ప్రారంభించిన ఈ చిత్రం ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. మే 2025 నాటికి షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతుండగా.. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నారు. దీపావళికి విడుదల కావచ్చని టాక్. దాదాపు 20 ఏళ్ళ తర్వాత సూర్య, త్రిష మళ్ళీ ఈ సినిమాలో కలిసి నటిస్తున్నారు. అనఘా రవి, సుప్రీత్ రెడ్డి, నాట్టి నటరాజ్, స్వాసిక, ఇంద్రన్స్, యోగి బాబు, శివద, తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సూర్య గత కొన్ని చిత్రాలు రెట్రో, కంగువా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని రాబట్టలేకపోయాయి. ఈ నేపథ్యంలో 'కరుప్ప' తో సూర్య మళ్ళీ సక్సెస్ ట్రాక్ లోకి రావాలని ఆశిస్తున్నారు ఫ్యాన్స్.

## మళ్లీ కలుద్దామా..? అల్లు అర్జున్ కోసం పూజ

ఒకప్పుడు గోల్డెన్ లెగ్ గా పిలవబడిన.. హీరోయిన్ పూజ హెగ్డే...అలా వైకుంఠపురంలో, అరవింద సమేత లాంటి బ్లాక్ బస్టర్ సినిమాల్లో నటించింది. అయితే గత కొద్ది రోజుల నుంచి..మాత్రం ఈ హీరోయిన్ కెరియర్ అంత సాఫీగా సాగడం లేదు. వరుస ఫ్లాపులతో తెగ సతమతమవుతోంది ఈ బుట్ట బొమ్మ. ఈ మధ్య విడుదలైన సూర్య సినిమా రెట్రో.. పైన ఎన్నో ఆశలు పెట్టుకుంది. కానీ ఆ చిత్రం సైతం.. డిజాస్టర్ గా నిలిచింది. చిరంజీవి ఆచార్య, ప్రభాస్ రాధే శ్యామ్ సినిమా దగ్గర నుంచి.. నిన్న మొన్నటి వరకు విడుదలైన పూజ సినిమాలు అన్నీ కూడా.. వరుస ఫ్లాపులుగా నిలిచాయి. ఇక దీంతో మంచి అవకాశాల కోసం తెగ ఎదురుచూస్తోంది ఈ హీరోయిన్. ఈ క్రమంలో పూజా హెగ్డే.. అల్లు అర్జున్ కోసం పెట్టిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ సందడి చేస్తోంది. అసలు విషయానికి వస్తే.. అల్లు అర్జున్, పూజ హెగ్డే కలిసి నటించిన అలా వైకుంఠపురంలో.. చిత్రం అప్పట్లో బ్లాక్ బస్టర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా కన్నా ముందు.. ఈ ఇద్దరి జంట డీజే సినిమాతో.. అందరినీ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకత్వం వహించగా.. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించారు. ఈ నేపథ్యంలో వీరిద్దరితో కలిసి పూజా హెగ్డే.. తన ఇంస్టాగ్రామ్ స్టేటస్ లో ఒక ఫోటో పెట్టింది. పక్కన హరీష్ శంకర్, దేవి శ్రీ ప్రసాద్ తో పెట్టుకొని ఫోటో తీసుకున్న పూజ పాప.. దానికి క్యాప్షన్ గా.. "మళ్లీ డీజే రి యూనియన్ కి ఛాన్స్ ఉందా.. అల్లు అర్జున్ ఎక్కడ ఉన్నావు..?" అంటూ బన్నీని ట్యాగ్ చేసింది.ఇక ఈ పోస్ట్ చూడగానే.. అల్లు అర్జున్ అభిమానులు తెగ మురిసిపోయారు. అన్నిటికన్నా గొప్ప విషయం ఏమిటి అంటే వెంటనే అల్లు అర్జున్.. 'నెక్స్ట్ టైం తప్పకుండా' అంటూ రిప్లై ఇచ్చేసారు. దీంతో హరీష్ శంకర్.. ఏమన్నా.. డీజే సినిమాకి సీక్వెల్ ప్లాన్ చేస్తున్నారా అంటూ అభిమానులు కామెంట్స్ పెట్టసాగారు. మొత్తానికి పూజ పెట్టిన పోస్ట్.. దానికి అల్లు అర్జున్ ఇచ్చిన రిప్లై ప్రస్తుతం తెగ వైరల్ అవుతూ అందరిని తెగ ఆకట్టుకుంటోంది.



## బాయ్ ఫ్రెండ్ తో రెచ్చిపోయిన ప్రియాంక జైన్..

'మౌనరాగం' సీరియల్ తో బుల్లితెర ప్రేక్షకులకు దగ్గరైన ప్రియాంక జైన్- శివ కుమార్ జంట.. అదే సీరియల్ సమయంలో ప్రేమలో పడ్డారు. గత ఐదేళ్లుగా ప్రేమలో ఉన్న ఈ జంట ప్రస్తుతం లివిన్ రిలేషన్ షిప్ లో ఉన్నారు. త్వరలోనే పెళ్లి కూడా చేసుకోబోతున్నట్లు తెలిపారు. అయితే వీరిద్దరూ సోషల్ మీడియాలో చేసే రచ్చ అంతా ఇంతా కాదు! తరచూ ఇన్ స్టాగ్రామ్ లో రొమాంటిక్ వీడియోలు, రీల్స్ షేర్ చేస్తూ ట్రెండ్ అవుతూ ఉంటారు. తాజాగా న్యూయార్క్ వీధుల్లో వీళ్ళ రొమాంటిక్ ఫోటో షూట్ నెట్టింట వైరల్ అవుతోంది. రోడ్డు మీద రొమాంటిక్ ఫోజులో ప్రియాంకను ముద్దుపెట్టుకుంటూ ఫోటోకు ఫోజులిచ్చాడు శివ కుమార్.



■ ఎడతెరపిలేని వర్షం.. ■ పొంగిన వాగులు, వంకలు ■ భయం గుప్పిట్లో లోతట్టు ప్రాంతాల ప్రజలుల్ల ■ సింగరేణి ఓసీల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ■ ఎల్లంపల్లి పెరుగుతున్న నీటి మట్టం ■ ఉప్పొంగుతున్న ఎర్రవాగు
■ ఎర్రవాగుకు పోటెత్తిన వరద ■ తృటిలో తప్పించుకున్న రైతు కూలీలు ■ ఎర్రవాగులో చిక్కుకున్న ట్రాక్టర్ ■ సహాయం చర్యల కోసం ఎదురు చూస్తున్న రైతు కుటుంబం ■ ఓసీపీల్లో ఉత్పత్తికి ఆటంకం ■ నిలిచిన బొగ్గు ఉత్పత్తి..

**మంచిర్యాల, జూలై 23 (ప్రభాత సమాచారం)** జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొరలుతున్నాయి. గోదావరి, ప్రాణహిత నదుల్లో భారీ గా వరద నీరు చేరింది. దీంతో నదుల పరివాహక ప్రాంతాల ప్రజలు ఒకింత భయాందోళనకు గురవుతున్నారు. గత రెండు రోజులుగా జిల్లాలో ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలోని కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లో 40.5 మి ల్లీ మీటర్లు, వేమనపల్లి మండలం నీల్వాయిలో 39.5, కోటపల్లి మండలం దేవులవాడలో 30.5, కన్నెపల్లి మం డల కేంద్రంలో 24.8 మి.మీ, నెన్నెల మండలంలో 18.5 మి.మీ, బెల్లంపల్లి మండలంలో 17.5, భీమిని మండ లంలో 17.0, కాసిపేట మండలం కొండాపూర్‌లో 16.5, జైపూర్, తాండూరు మండలాల్లో 12.8, మందమర్రి మండలం అందుగుల పేటగలో 11.3 మిల్లీ మీటర్ల చొ ప్పున వర్షపాతం నమోదైంది.

**కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు....**

జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రజ లకు అందుబాటులో ఉండే విధంగా కలెక్టరేట్‌లో ప్రత్యే కంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. వరద ప్రభా విత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించా రు. జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉండి, అవస రమైన సేవలు అందజేస్తుందని తెలిపారు. సహాయం కోసం ప్రజలు 08736-250501 నంబర్‌లో సంప్రదిస్తే తక్షణమే స్పందించనున్నట్లు తెలిపారు.

**ఓసీపీల్లో ఉత్పత్తికి ఆటంకం...**

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి డివిజన్‌లలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలు, ఓబీ మట్టి తొలగింపు పనులు నిలిచిపోయాయి. క్వారీల్లో నీరు నిలిచిపోవడంతో పనులు జరగడం లేదు. భారీ వాహనాలు బురదలో కూరుకుపోయే అవకాశం ఉండటంతో ఒడ్డుపై నిలిపి ఉంచారు. మూడు ఏరియాల్లోని ఇందారం, రామకృష్ణాపూర్, మందమర్రి, గోలేటి, కైరిగూడ ఓసీపీల్లో దాదాపు రూ. 13 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తితోపాటు, రూ. 4 కోట్ల విలువైన ఓబీ మట్టి వెలికితీత పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.

**ఎల్లంపల్లిలోకి కొనసాగుతున్న వరద....**

భారీ వర్షాల కారణంగా గుడిపేట సమీపంలోగల ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 148 మీటర్లు కాగా ప్రస్తుతం 142.96 మీటర్ల ఎత్తు వరకు నీటి మట్టం ఉంది. అలాగే ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను సాయంత్రం 8.8832 టీఎంసీల నీరు చేరింది. ఎగువ నుంచి 2334 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతుండగా హైద్రాబాద్‌లోని మెట్రోపాలిటన్ వాటర్ స్కీం కోసం 331 క్యూసెక్కులు, ఎన్టీపీసీ అవసరాలకు మరో 121 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

**ఆసిఫాబాద్, జూలై 23 (ప్రభాత సమాచారం)** కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలంలో 234.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్‌లో 106.5, కౌటాల మండల కేంద్రంలో 103.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. బెజ్జూరు మండలంలో బుధవారం ఉదయం నుంచి ఏకదాటిగా కురిసిన కుండపోత వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. సుమారు 6 గంటల పాటు కురిసిన భారీ వర్షానికి మండలంలోని వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. పంట చేలలోకి భారీగా వర్షపు నీరు చేరింది. కుశ్నపల్లి, సోమిని గ్రామాల మధ్య లో లెవల్ వంతెనలు ఉప్పొంగి ప్రవహించడంతో వాగు అవతల ఉన్న సుమారు 8 గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. గోల్కొండ, ఏటిగూడ మధ్య ప్రధాన రోడ్డుపై కల్వర్టపై భారీగా వరద నీరు చేరడంతో కొద్ది సేపు రాక పోకలు నిలిచి పోయాయి. వర్షకాలంలో ఇదే భారీ వాన కురిసింది. మండలంలో 216.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు తహసీల్దార్ రామ్మోహన్ తెలిపారు. మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా మురికి కాలువలు లేక పోవడంతో వరద నీరు పలువురి ఇళ్లలోకి చేరింది. మండల కేంద్రం సమీపంలో ప్రవహిస్తున్న వాగు ప్రవాహంలో మతిస్థిమితం లేని వ్యక్తి చిక్కుకున్నాడు. వాగు సమీపంలో స్మశాన వాటిక ఉండడంతో దాని చుట్టు భారీగా వరద నీరు చేరింది. మతిస్థిమితం లేని వ్యక్తి అందులోనే తలదాచుకున్నాడు. కాగా విషయం తెలుసుకున్న ఎస్సై సర్తాజ్‌పాషా సంఘటన స్థలానికి చేరుకుని మతిస్థిమితం లేని వ్యక్తిని బయటకు తీసుకు వచ్చేందుకు ఎన్డీఆర్ఎఫ్ అధికారులతో మాట్లాడారు. భారీ వర్షం కురిసిన కార ణంగా గొల్లబాయి చెరువు పరవళ్లు తొక్కుతోంది. రెండు రోజుల పాటు భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మండల కేంద్రం సమీపంలోని వాగు అవతల ఉన్న శ్మశాన వాటికలో చిక్కుకున్న మతి స్థిమితం లేని వ్యక్తిని కౌటాల సీఐ రమేశ్, తహసీల్దార్ రామ్మోహన్ ఎస్సై సర్తాజ్‌పాషా ఆధ్వర్యంలో గామస్థులు తాళ్ల సాయంతో బయటకు తీసుకు వచ్చారు.

**చింతలమానేపల్లి :** చింతలమానేపల్లి మండల వ్యాప్తంగా బుధవారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దిందా-కేతిని గ్రామాల మధ్య వాగు ఉప్పొంగడంతో దిందా గ్రామ వాసులకు రాక పోకలు నిలిచి పోయాయి. అలాగే శివప్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. బాబాసాగర్, నాయకపుగూడ వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండల కేంద్రంలోని పలువరి ఇళ్లలోకి వరద నీరు రావడంతో పంచాయతీ కార్యదర్శి ఆసీఫ్ ఆలీ ఆధ్వర్యంలో వరద నీటిని మళ్లీంచారు. అలాగే పంట పొలాల్లో, పత్తి చేనులలో, రోడ్లపై వరద నీరు పారుతుంది. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇంత వరకు వర్షాపాతం ఎప్పుడు లేక పోవడంతో మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేపల వేటకు వెళ్లరాదని, ప్రమాదకరంగా వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని రెవెన్యూ, పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. ఏకదాటిగా కురిసిన వర్షానికి పెద్దవాగు, ప్రాణహిత వరద ఉధృతికి మురళీగూడ, జిల్లెడ, కమ్మర్‌గాం గ్రామాల్లో పంట చేనుల్లో నీరు చేరింది. పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు బురద మయంగా మారాయి. పలు గ్రామాల్లో రోడ్లపై నుంచి వరద పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉచ్చమల్లవాగు, బొక్కివాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.

**దహెగాం :** దహెగాం మండల వ్యాప్తంగా బుధవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో ఒర్రెలు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు నిండి జలకళను సంతరించుకున్నాయి. అయినం గ్రామ సమీపంలో లో లెవల్ కల్వరు, బొప్పారం గ్రామానికి వెళ్లే దారిలో ఒర్రె ఉప్పొంగి ప్రవహిస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో ఒర్రె దాటి గిరిజనులు రాక పోకలు సాగిస్తున్నారు.

**కాగజ్‌నగర్ :** కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోకి వర్షం నీరు వచ్చింది. చిరువ్యాపారులు దుకాణాలు పెట్ట లేదు. పట్టణ వాసులు అత్యవసరముంటే బయటికి వచ్చారు. అలాగే వ్యాపార సంస్థలు తెరిచినప్పటికి కూడా కొనుగోలు దారులు రాలేదు.

**సిర్పూర్(టి) :** సిర్పూర్(టి)లో ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షం తో ప్రజలు ప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రహీమోద్దీన్, ఎస్సై కమలాకర్, ఎంపీడీఓ సత్యనారాయణలు అన్నారు. ఈ సందర్భంగా వారు ఎప్పటికప్పుడు లోతట్ట ప్రాంతాల పరిస్థితులపై సమీక్షిస్తున్నారు. నది పరివాహక, లోతట్టు ప్రాంతాలైన హుడ్కిలి, జక్కాపూర్, నవేగాం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్**

రాష్ట్రంలో వారం రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసినందున లోతట్టు ప్రాంతాలు, ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ బుధవారం ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రవాహం ఉన్న వంతెనలు, కల్వర్ట్, రహదారులపై నుండి ప్రజలు దాటవద్దని, జలాశయాలు, చెరువులు, కుంటలను చూడడానికి వెళ్లకూడదని అన్నారు. శిథిల వ్యవస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండద్దని, తడిగా ఉన్న కరెంట్ పోల్స్ తాకవద్దని, గ్రామాలలో చేపల వేటకు ఎవరు వెళ్ళవద్దని, రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలని, నీరు నిల్వ ఉన్న విద్యుత్ స్తంభాల దగ్గరికి వెళ్లరాదని, వాటర్ ఫాల్స్ లాంటి ప్రాంతాలను సందర్శించవద్దని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరు బయటకు రావద్దని, వరద ప్రవాహల వద్ద బందోబస్త్ ఉన్న పోలీస్ సిబ్బంది సూచనలు పాటించి పోలీసు వారికి సహకరించాలని సూచించారు. జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైన వాటిని ఎదుర్కొనేందుకు జిల్లా పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉందని, ముంపు ప్రాంతాల ప్రజలకు తక్షణ సహాయం కోసం జిల్లా విపత్తు ప్రతిస్పందన దళాలు బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. జిల్లా పాలన యంత్రం, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, రెస్క్యూ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. విపత్కార పరిస్థితులు ఎదురైతే ప్రజలు పోలీస్ శాఖ సహాయం తీసుకోవాలని, డయల్ 100 లేదా 87126 70551 నెంబర్ ని సంప్రదించాలని తెలిపారు. జిల్లాలో ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా పోలీసులు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

**వాగులో చిక్కుకున్న మతిస్థిమితం లేని వ్యక్తిని రక్షించిన అధికారులు**

బెజ్జూర్ మండలంలో ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షాలకు మత్తడివాగు ఉప్పొంగి ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు సమీపంలోని శ్మశాన వాటికలో నివాసం ఉంటున్న మతిస్థిమితం లేని వ్యక్తి, వరద ఉధృతిలో అక్కడే చిక్కుకుపోయాడు. వర్షం కొనసా గుతున్నా, అతను వాగు మధ్యలోనే ఉండిపోవడం గమనించిన స్థానికులు వెంటనే రెవెన్యూ, పోలీస్ అధికా రులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి బెజ్జూర్ తహసీల్దార్ రామ్మోహన్, కౌటాల సీఐ ముత్యం రమేష్, ఎస్ఐ సర్దాజ్ పాషా చేరుకుని రక్షణ చర్యలు ప్రారంభించారు. వాగు ఉధృతిని లెక్కచేయకుండా, తాళ్ల సహాయంతో ఈతగాళ్లను పంపించి, కొట్టుమిట్టాడుతున్న మతిస్థిమితం లేని వ్యక్తిని సురక్షితంగా బయటకు తీసుకు వచ్చారు. ప్రాణాపాయం నుంచి కాపాడిన రెవెన్యూ, పోలీస్ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



**తృటిలో తప్పించుకున్న రైతు కూలీలు**

మంచిర్యాల జిల్లా భీమిని మండలం చిన్న తిమ్మాపూర్ ఎర్రవాగు ట్రాక్టర్ తో దాటుతుండగా వరదనీటిలో ట్రాక్టర్ చిక్కికుని తృటిలో రైతు కూలీలు ప్రాణాలను దక్కించుకున్న సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి భీమిని మండలం చిన్న తిమ్మాపూర్ ఎర్రవాగు ఉప్పొంగుతోంది. భీమిని మండలం చిన్న తిమ్మాపూర్‌లో పత్తి చేనుకు మందు కొట్టడానికి కన్నెపల్లి మండలం జంగంపల్లి కి చెందిన బోరు కుంట రాజం తన భార్య మరో ఇద్దరు కూలీలతో వెళ్లారు. పనిపూర్తి చేసుకొని రాజం ఆయన భార్య మరో ఇద్దరు కూలీలతో భారీ వర్షంలోనే ట్రాక్టర్ తో తిరుగు ప్రయాణమ య్యాడు. అప్పటికే భారీ వర్షానికి ఎర్రబాగు ఉధృతంగా వరద ఉప్పొంగుతోంది. గత్యంతరం లేక ఇంటికి రావడానికి ట్రాక్టర్ ద్వారా ఎర్రవాగు దాటుతుండగా వరదలో ట్రాక్టర్తోపాటుగా వారు ఎర్రవాగులో చిక్కుకున్నారు. వరద ఉధృతిలో కొట్టుకుపోయే ప్రమాదం నుంచి నలుగురు వ్యక్తులు తృటిలో ప్రాణాలు తప్పించుకుని ఒడ్డుకు చేరారు.

**ఖండాల జలపాతంలో విద్యార్థి గల్లంతు**



ల్లఆదిలాబాద్ రూరల్ మండలం ఖండాల జలపాతంలో ఓ విద్యార్థి గల్లంతైన ఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని భూక్తా పూర్ కాలనీకి చెందిన మనోహర్ సింగ్ యువకుడు తన ఇద్దరు మిత్రులతో కలిసి బుధవారం ఖండాల జలపాతం వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు జలపాతంలో మనోహర్ సింగ్ గల్లంతయ్యాడు. ఇద్దరు మిత్రులు భయ పడి ఆదిలాబాద్‌కు వచ్చేసారు. సమాచారం అందుకున్న పోలీసులు డిడిఆర్ఎఫ్ బృందంతో ఘటన స్థలానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు.

# మంత్రులను కలసి కృతజ్ఞతలు తెలిపిన ఖానాపూర్ ఎమ్మెల్యే





**ఉట్నూర్, జూలై 23 (ప్రభాత సమాచారం)** కొమరం భీం కన్జర్వేషన్ టైగర్ కారిడార్ జీవో 49 నిలుపుదలకు ప్రత్యేక కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు , ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ లను ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ , ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని పీఎంఆర్సి భవనంలో ఆదివాసులతో సమావేశమై జివో 49ను రద్దు చేస్తామని నాడు మాటిచ్చి నేడు జివోను నిలుపుదల చేయడంలో ఆదివాసుల ఆవేదనను ప్రభుత్వానికి తెలియపర్చడంలో కీలక పాత్ర పోషించిన మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా
# మనోజ్ నియామకం

**బెల్లంపల్లి, జూలై 23 (ప్రభాత సమాచారం)**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌కు మరోసారి ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించారు. నూతన సబ్ కలెక్టర్‌గా ఐఈఎస్ ఎస్ డి మనోజ్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2023 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన మనోజ్ రెండు రోజుల్లో ఉద్యోగ బాధ్యతలు చేరనున్నారు. నూతనంగా ఆవిర్భవించిన బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌కు మొదటి సబ్ కలెక్టర్‌గా పిఎస్ రాహుల్ రాజ్‌ను నియమించారు. 2018 నుంచి 2020 వరకు సబ్ కలెక్టర్ గా పీ ఎస్ రాహుల్ రాజ్ పనిచేశారు. రాహుల్ రాజు బదిలీ తర్వాత ఆర్డీవో స్థాయి అధికారులు పనిచేస్తున్నారు. ఆర్డిఓ పి హరికృష్ణ కూడా వదిలేయ్యారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయన స్థానంలో బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ కు నూతన ఐఏఎస్ అధికారిని సబ్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బీఆర్ఎస్ హయాంలోనే టైగర్ రిజర్వు ప్రతిపాదనలు

**జీఓ 49 పై సిర్పూర్ ఎమ్మెల్యే**
**పాల్వాయికీ అవగాహన లేదు**
**మాజీ ఎంపీ సోయం బాపూరావు**



**కాగజ్‌నగర్, జూలై 23 (ప్రభాత సమాచారం)** టైగర్ రిజర్వు ప్రతిపాదనలు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జీవో49ని రద్దు చేసిందని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జీవో అమలు జరిగితే తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని ప్రజలకు స్పష్టమైన హామీ ఇస్తున్నానని చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఆదివాసీల హక్కులను కాలరాసేందుకు గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, బీజేపీ ప్రభుత్వం కలిసి నేషనల్ టైగర్ జోన్‌కు ప్రతిపాదనలు చేశాయని అన్నారు. ఈ ప్రతిపాదనల్లో కూడా బీఆర్ఎస్ నాయకుల సంతకాలు కూడా ఉన్నాయని సాక్ష్యాలను కూడా చూపారు. ఈ జీవో రద్దు చేయాలని ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు తీవ్రంగా కృషి చేశారని తెలిపారు. మాజీ ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆదివాసీలను మోసగించాలనే కుట్రలు మానుకోవాలని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా ప్రజాప్రతినిధుల కృషితోనే జీవో49 రద్దు చేయడంలో జరిగినట్టు పేర్కొన్నారు. జీవో 49 రద్దయిం దని తెలిపారు. సమావేశంలో మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగీర్‌తో పాటు మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY



## గిరిజనుల సమస్యల పరిష్కారానికి
# ఖానాపూర్ ఎమ్మెల్యే కృషి
## కాంగ్రెస్ గిరిజన నాయకులు

**ఉట్నూర్, జూలై 23 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసి గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని ఖానాపూర్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ఆత్రం రాహుల్, ఉట్నూరు మండల కాంగ్రెస్ నాయకులు ఆత్రం తిరుపతి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు బానోత్ జై వంతరావు లు అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జీవో 49 రద్దు కోసం ఉదయం నుంచి రాత్రి వరకు హైదరాబాద్ లోని కార్యాలయాల చుట్టూ తిరిగి మంత్రులతో కలిసి, ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి జీవో 49 రద్దు చేయించడానికి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ రాత్రి పగలు కష్టపడ్డారని అన్నారు. మంత్రి సీతక్క తో పాటు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సోయం బాపూరావు, ఆత్రం సక్కు లతో కలిసి జీవో 49 రద్దు చేయించడానికి ముఖ్యమంత్రిని కలిశారన్నారు. గత ప్రభుత్వ హాయంలోనే జీవో 49 తయారైందని అన్నారు. బి ఆర్ ఎస్, బిజెపి రెండు పార్టీలు గిరిజనులకు అన్యాయం చేయడానికి కృషి చేస్తూనే ఉంటాయని, ప్రజలు ఈ పార్టీలను నమ్మ వద్దన్నారు. జీవో రద్దు చేయకపోతే ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఇప్పటికే తాను రాజీనామా చేస్తానని ప్రకటించారన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి గిరిజనులను మభ్య పెట్టడానికి పనికొస్తారని, ఆదివాసులకు ఏ సమస్యలు వచ్చినా పట్టించుకోరని అన్నారు. గతంలో జైనూరు సంఘటనలో గిరిజనులు గిరిజనే తరులు ఇబ్బందులు పడ్డ ఎమ్మెల్యే ఏమాత్రం స్పందించకపోవడంతో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ జోక్యం చేసుకొని సమావేశాలు నిర్వహించి పరిస్థితులను అదుపులోకి తెచ్చారన్నారు. ఎమ్మెల్యే కోవలక్ష్మికి ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలు ఏమాత్రం తెలియవని, ఆమె కుటుంబ సభ్యులు ఎవరు కూడా ఆదివాసుల సాంప్రదాయాలు పాటించడం లేదని ఆరోపించారు. ఆదివాసుల సంరక్షణ కోసం అన్నివేళలా కృషి చేస్తున్న బొజ్జూ పటేల్ ను విమర్శించడం సరైనది కాదన్నారు. ఈ సమావేశంలో కోట్నాక్ ఉమేష్, వెడ్మ కొద్దు పటేల్, ఆత్రం మోతీరాం, మెస్రం భాగ్యలక్ష్మి, సి డాం కౌసల్య, సులోచన తదితరులు పాల్గొన్నారు.